# సహజీవన ధర్మం

ఆ రోజు ఎండ బాగా తీవ్రరూపం దాల్చి మండిపోతున్నది. దాదాపు డెబ్బై సంవత్సరాల వయసు. తలంతా ముగ్గుబుట్టలా తెల్లబడిపోయి వుంది. ఆయాసంతో వగరుస్తూ బ్యాంక్ దగ్గరకు చేరుకున్నాడు హరినారాయణ. బ్యాంక్ తెరిచే వుంది. తన పాస్ బుక్ జేబులో నుండి బైటకు తీసి క్యాష్‌కౌంటర్లో వున్న ఎంప్లాయ్‌ని పెన్షన్ ఎకౌంటులోకి వచ్చిందేమోనని అడిగాడు.

"ఈరోజు ఇయర్ ఎండింగ్ మాస్టారూ. వర్క్ చేస్తాం కానీ! క్యాష్ ట్రాన్‌శాక్షన్స్ జరగవు" కాస్తంత బిజీగా చెప్పాడు క్యాషియర్. ఉస్సూరుమంటూ వెనుతిరిగి వెళ్ళిపోయాడు. ఆ మర్నాడు ఆదివారం బ్యాంక్‌కు సెలవు. ఆ తర్వాతి రోజు సోమవారం తిరిగి బ్యాంక్ దగ్గరకు చేరుకున్నాడు హరినారాయణ.

ఆశ్చర్యం! బ్యాంక్ పదిన్నర దాటుతున్నా తెరవలేదు సరికదా బ్యాంక్ సిబ్బంది యావత్తూ ప్లకార్డులు చేతపుచ్చుకుని బ్యాంక్ ఎదురుగా వున్న రహదారికి అడ్డంగా నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తున్నారు.

బ్యాంక్ వాళ్ళు సమ్మె చేస్తున్నారన్న విషయం అర్థమైన హరినారాయణకు ముచ్చెమటలు పట్టాయి. పెన్షన్ తాలూకూ డబ్బు చాలా అవసరం. గబగబా సమ్మె చేస్తున్న బ్యాంకు ఉద్యోగుల దగ్గరకు వెళ్ళి "బాబూ! ఈరోజు కూడా మా పెన్షన్స్ ఇవ్వరా?" అనడిగాడు ముఖ పరిచయమున్న క్యాషియర్‌ని. క్యాషియర్ వ్రతభంగం కలిగించిన అల్లుడిని ఒక్క చూపు చూసి "ఇవతల మా సమస్యలు బోలెడు పరిష్కారం కావాలి. అప్పటిదాకా నిరవధికంగా సమ్మె చేస్తాము" అని చెప్పి తిరిగి గుంపులో గోవిందలాగా నినాదాలివ్వసాగాడు.

హరినారాయణ బాగా కృంగిపోయాడు. ఏదో గొణుగుతూ ఇవతలకు వచ్చాడు. ఇంతలో ఆయన దగ్గరికో అపరిచిత వ్యక్తి వచ్చి... "ఏం మాస్టారూ డబ్బులు బాగా అవసరమా?" అనడిగాడు.

ఏమాత్రం ఆలోచించకుండా "ఆ అవసరమే బాబూ" అన్నాడు.

"ఎంత కావాలి?" అడిగాడు అపరిచితవ్యక్తి.

"ఓ రెండు వేలు. చాలా అవసరం. పెన్షన్ డబ్బులు తీసుకోగానే ఇచ్చేస్తా.." చెప్పాడు విశ్వాసంనిండిన చూపులతో.

అపరిచితవ్యక్తి ఫెళ..ఫెళా నవ్వాడు. అతడెందుకలా నవ్వాడో అర్థం కాలేదు. అయోమయంగా చూశాడు



హరినారాయణ. అపరిచితవ్యక్తి తిరిగి తనే మాట్లాడుతూ-

"చూడండి మాస్టారూ! నేను వడ్డీ వ్యాపారిని. నెలలో మొదటివారం ఈ బ్యాంకు దగ్గరే వుంటాను. ఎందుకంటే నా దగ్గర అప్పు తీసుకున్న చాలామంది ఉద్యోగులు, పెన్షనర్లు ఈ వారం రోజుల్లోనే నాకు బాకీ జమ చేస్తుంటారు. మిమ్మల్ని చాలా రోజులనుండీ చూస్తున్నాను. రెండు వేలు కావాలంటే ఇస్తాను. అయితే నాకు రెండు వందలు కలిపి ఇవ్వాలి. అలాగైతే తీసుకుని మీ అర్జెంటు అవసరాన్ని జరుపుకోండి" అంటూ విషయం అరటిపండు ఒలిచి పెట్టినంత తేలిగ్గా అర్థమయ్యేట్లు చెప్పాడు.

హరినారాయణ భృకుటి ముడిపడింది. రెండు నిముషాలపాటు ఆలోచనలో మునిగిపోయాడు. ఆ తర్వాత ఓ నిర్ణయానికి వచ్చిన వాడిలా ముందుకు వంగి-

"సరే! అలాగే రెండు వందలు కలిపి ఇస్తాను. రెండు వేలు ఇవ్వు బాబూ!" అన్నాడు.

అపరిచిత వడ్డీవ్యాపారి తన జేబులోంచి కరెన్సీ తీసి రెండు వేలు లెక్క పెట్టి ఇస్తూ రెండో చేయి చాపి-

"మీ దగ్గరున్న ఆ పాస్ బుక్ ఇటివ్వండి" అన్నాడు.

హరినారాయణ తటపటాయిస్తూనే తన పెన్షన్ తాలూకూ ఎకౌంట్ పాస్ బుక్ ఇచ్చి అతని దగ్గర రెండు వేల రూపాయలు తీసుకుని జేబులో పెట్టుకుని చక, చకా వెళ్ళిపోయాడు.

వారం రోజులు గడిచిపోయాయి. బ్యాంక్ సిబ్బంది సమ్మెను విరమించారు. కార్యకలాపాలు యధావిధిగా ఆరంభమయ్యాయి. హరినారాయణ బ్యాంక్‌కు వచ్చి వడ్డీవ్యాపారి దగ్గరి పాస్ బుక్ తీసుకొని తన పెన్షన్ డబ్బు డ్రా చేసి రెండు వేలు ప్లస్ వడ్డీ రెండు వందలు ఇచ్చి థాంక్స్ చెప్పాడు. వడ్డీవ్యాపారి నవ్వుతూ "ఈ రెండు రోజుల్లో డబ్బుకు అంత అవసరం ఏమొచ్చింది మాస్టారూ?" అనడిగాడు. హరినారాయణ "నా వెంట రా బాబూ!" అంటూ అతడ్ని వెంటబెట్టుకుని ఓ వృద్ధాశ్రమానికి తీసుకువెళ్ళాడు. అక్కడ పదిమంది దాకా పండు వృద్ధులు వున్నారు. వారిని చూపిస్తూ "గత నాలుగు రోజుల్నుండీ ఈ వృద్ధులకు ఆహారం లేదు. నా పెన్షన్ డబ్బు ఆలస్యమైపోతే వీరు, వీరితో పాటూ నేనూ ఆకలితో చచ్చిపోతాం. అందుకే వీరితోపాటే వుంటున్న నేను సహజీవన ధర్మంగా నీ దగ్గర వడ్డీకి తీసుకొని మరీ అవసరం తీర్చుకోవాల్సి వచ్చింది.." అన్నాడు.

వడ్డీవ్యాపారి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. ఏమీ మాట్లాడలేకపోయాడు. తన జేబులో వున్న రెండు వేలు తీసి ఇస్తూ "ఈ డబ్బు నా విరాళంగా వుంచండి మాస్టారూ" అని చెప్పి గబ గబా వెళ్ళిపోయాడు. హరినారాయణ విస్మయంగా చూస్తుండిపోయాడు.

**-పి.వి.రమణకుమార్**
**(చిలకలూరిపేట)**




